క్లుప్తంగా

పదమాయ వలసలో పంటకోత ప్రయోగం



పదమాయివలసలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించిన వీఏఏ

బలిజిపేట: మండలంలోని పదమాయవలసలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. పంటకోత ప్రయోగాలవల్ల పంట దిగుబడి ఏమేరకు వచ్చిందో తెలుస్తుందని ఏఎస్ఓ విజయ రావు ఈ సందర్భంగా తెలిపారు. గ్రామానికి చెందిన కిమిడి రాము పంటపొలంలో 5అడుగుల పొడవు, 5అడుగుల వెడల్పు విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేశారు. ఈ విస్తీర్ణానికి 18.1కిలోల దిగుబడి వచ్చింని ఏఎస్ఓ చెప్పారు. ఈ ప్రకారం ఎకరాకు 2,992కిలోల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలున్నాయన్నారు. రైతుల పంటలకు ఈక్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల వారి పంటను వారే విక్రయించుకునేందుకు వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాలూరులో జగనన్నకుచెబుదాం రేపు

సాలూరు: కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం) జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పార్వతి బుధవారం తెలిపారు. ఈ రోజు ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందన్నారు.ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుణ్యస్నానాల సమయంలో జాగ్రత్త

- డీఎస్పీ మురళీధర్

పార్వతీపురంటౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నదీతీర ప్రాంతాలు, కాలువల్లో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం డీఎస్పీ జి. మురళీధర్ సూచించారు. పుణ్యస్నానాలకు మహిళలు ఒంటరిగా వెళ్లకూడదని, దీపాలు వెలిగించే టప్పుడు జాగ్రత్తలు పాటించాలని, దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్తీక మాస స్నానాలు, దీపాలు వదిలే ప్రాంతాలైన శివాలయాలు, నదీ తీర ప్రాంత శైవాలయాల దగ్గర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశమున్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు

కార్తీక మాసోత్సవాలు ముగిసేవరకు జిల్లాలోని ముఖ్య ప్రాంతాలైన సాలూరు, పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల, కొమరాడ మండలంలోని దేవుని గుంపలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.పోలీసులు సూచనలు ప్రజలు పాటిస్తూ నదీస్నానాలు ఆచరించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక విద్యే పునాది

బలిజిపేట: ప్రాథమిక విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది అని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు మండలంలోని పదమాయవలస, పి.రావివలస ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌పుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించి ఉపాధ్యాయులు వాటిని సక్రమంగా సవరిస్తున్నదీ లేనిది చూశారు. అనంతరం బోర్డుపై పదాలను రాసి విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అద్దె బకాయిలు చెల్లించండి



పైలెట్ వాటర్‌స్కీమ్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

సాలూరు: మున్సిపాలిటీ ఆవరణలో గల ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ లీజుదారులు అద్దె బకాయిలు చెల్లించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె తన కార్యాలయంలో లీజుదారులతో సమావేశమయ్యారు. లీజుదారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ జయరాం, ఇన్‌చార్జ్ రెవెన్యూ ఆఫీసర్ రాఘవాచార్యులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పైలెట్ వాటర్‌స్కీమ్‌లు ప్రారంభం

పట్టణంలో 26వ వార్డు వెంకటేశ్వరకాలనీలో రెండు పైలెట్ వాటర్‌స్కీమ్‌లను ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం ప్రారంభించారు. గడపగడపకుమన ప్రభుత్వం నిధులు సుమారు రూ.3 లక్షలతో రెండు పైలెట్ వాటర్‌స్కీంలు నిర్మించారు. మున్సిపల్‌చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ జయరాం, కౌన్సిలర్‌లు గిరిరఘు, సన్యాసమ్మ తదితరులువాటర్‌స్కీమ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు అప్పలస్వామి పాల్గొన్నారు.

అందాల గుహలో శివయ్య

- అడ్డాపుశీలలో నెలకొన్న ఆధ్యాత్మిక శోభ
- ఆలయంలో కాశీవిశ్వేశ్వరుడితో పాటు మరో 12 ఉపఆలయాలు



అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర ఆలయం



అడ్డాపుశీల దేవాలయ ప్రాంగణంలో ఉన్న ప్రపంచంలోనే అతి పెద్దదైన మహానంది విగ్రహం



అడ్డాపుశీలలో కాశీ విశ్వేశ్వర శివలింగం

గతానికి మిన్నగా ఆలయాభివృద్ధి

కాశీవిశ్వేశ్వరుని ఆలయం గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదు. నాలుగేళ్లుగా ఆలయం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఫలితంగా భక్తుల తాకిడి ఎక్కువైంది. ఏటా కార్తీక మాసంలో, శివరాత్రికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని స్వామివారికి పూజలు నిర్వహించడమే కాకుండా రుద్రాభిషేకాలు, ప్రత్యేకాభిషేకాలు చేస్తూ తమ భక్తిని చాటుకుంటారు.

– అక్కేన సుందరనాయుడు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్



ఆలయ ముఖద్వారం

పార్వతీపురం టౌన్: శివునికి ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసం ప్రారంభమైంది. ఈ మాసంలో పార్వతీపురం జిల్లా కేంద్రానికి 4కిలోమీటర్ల దూరంలో అడ్డాపుశీలలో కొలువైన కాశీవిశ్వేశ్వరునికి రుద్రాభిషేకాలు, బిల్వార్చన, రుద్రాభిషేకాలు విశేషంగా చేస్తారు. విశేషార్చనలు చేసే భక్తులకు కాశీవిశ్వేశ్వరుడు ప్రసన్నుడై వారి అభీష్టాలను తీరుస్తాడు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఈ ఆలయానికి వేలాది మంది భక్తులు పోటెత్తుతారు. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయ ప్రాంగణంలో కాశీవిశ్వేశ్వరునితోపాటు మరో 12 ఆలయాలు కూడా ఉన్నాయి. దేవాదాయశాఖ చొరవతో మళ్లీ ఈ దేవాలయానికి కొత్త రూపు వచ్చింది. ప్రపంచంలో అతి పెద్ద మహానంది విగ్రహాన్ని కూడా ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసింది. ఇంకా ఈ ప్రాంగణంలో ఈశ్వరునికి ప్రీతిపాత్రమైన ఉసిరి, మారేడు చెట్లను పెంచారు.

పలు ప్రాంతాల భక్తుల రాక

సుమారు 500 ఏళ్ల క్రితం వెలసిన ఈ కాశీవిశ్వేశ్వరుని ఆలయానికి పూర్వం నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా భక్తులు వచ్చి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఆలయానికి ఇలా చేరుకోవాలి.

జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాలంటే పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాలకొండ, కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఎక్కి అడ్డాపుశీల బస్టాపు వద్ద దిగి అక్కడ నుంచి 600 మీటర్ల దూరంలో ఉన్న కాశీవిశ్వేశ్వరుని ఆలయానికి చేరుకోవచ్చు. పార్వతీపురం నుంచి ఆటోల్లో కూడా చేరుకోవచ్చు. పార్వతీపురం, పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్‌లో దిగిన భక్తులు కూడా ఆటోల సహాయంతో గాని, బస్సుల్లోగాని చేరుకోవచ్చు.

కార్తీక మాసంలో దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

కార్తీక మాసంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడంతో వారికి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు సమయం ఎక్కువగా ఉండడంతో క్యూలో నిలిచి ఉండే వారికి తాగడానికి నీరు, మజ్జిగ, ప్రసాదం వంటి సదుపాయాలను కల్పిస్తూ చర్యలు చేపట్టారు.

'ప్రపంచంలోనే అతిపెద్ద నందివిగ్రహం

ఈ ఆలయ ప్రాంగణంలో 47 అడుగుల వెడల్పు, 42 అడుగుల ఎత్తు, 24 అడుగుల కైవారం గల అతి పెద్ద నంది విగ్రహాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసింది. దీని నిర్మాణం వల్ల ఈ ప్రాంగణానికి కొత్త రూపు వచ్చింది. దీంతో భక్తుల తాకిడి కూడా పెరిగింది.

భావితరాలకు జగన్ అవసరం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

బలిజిపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలన భావితరాల భవిష్యత్తుకు పునాది అని బలిజిపేట జెడ్పీటీసీ ఎ.రవికుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని చిలకలపల్లిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిపాలన రానున్న తరాల యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, ఉద్యోగ అవకాశాలను కల్పించడం వంటి వాటితో భవిష్యత్ తరాలకు భరోసా కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీటీసీ మల్లిక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ భానుమూర్తి, ఎంఈఓ సామల సింహాచలం, పలగర సహకార సంఘం అధ్యక్షుడు పకీరునాయుడు, జగన్, టి.ప్రసాదరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి తదితరులు

సాలూరు: పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో ప్రభుత్వ పత్తికొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి ఈ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు దళారుల బారిన పడి మోసపోకూడదనే ప్రధాన ఉద్దేశంతో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో ఈ కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈ కొనుగోలు కేంద్రంపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు,సిబ్బంది అవగాహన పెంపొందించాలని కోరారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు.అనంతరం రైతుల నుంచి పత్తికొనుగోలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌జేడీఏఎం సుధాకర్, ఆర్‌డీడీ ఏఎం యర్రన్న, డీటీఎంఓ అశోక్‌కుమార్, గ్రేడ్-1 కార్యదర్శి బి.భారతి, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, ఏడీఏ మధుసూదనరావు, ఏఓ అనూరాధ, వైఎస్సార్‌సిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదిరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

సాలూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డిపద్మావతి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాయాలను సద్వినియోగం చేసుకుని మంచి విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని సూచిస్తూ గ్రంథాలయ వారోత్సవాల ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పణుకువలసలో వై ఏపీ నీడ్స్ జగన్



వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన వివరాలు ఉన్న డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రమీల, ప్రజా ప్రతినిధులు



ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాభివద్ధి పథకాల గురించి అభిప్రాయాలను తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు

పాచిపెంట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు వివరంగా చెప్పాలనే ఉద్దేశంతోనే వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామని పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. ఈ మేరకు మండలంలోని పణుకువలస గ్రామ సచివాలయం పరిధిలో సర్పంచ్ చెల్లూరి సీతారాం అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ముందుగా సచివాలయం పరిధిలో వివిధ లబ్దిదారులకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డులను ఎంపీపీ ప్రమీల తదితరులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగన్ మోహన్ రెడ్డి చేసిన ప్రగతి గురించి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరంగా తెలియజేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్న, వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో పాటు భవిష్యత్తు తరాల బాగు కోసం మంచి చేస్తున్న ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కోరుపల్లి రవీంద్రనాథ్, ఎంపీటీసీలు తాడంగి సింహాచలం, దండి ఏడుకొండలు, కాదల అన్నపూర్ణ, మాదల సత్యవతి, డొనేరు లచ్చయ్య, తోకల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సుభిక్షంగా రాష్ట్రం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జెండాతో ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డోడ్డనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉంటున్నారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 1, 2 వార్డులు, మండలంలోని కృష్ణపల్లి సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంలో గానీ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో గాని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో పలువురికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. జాతీయస్థాయిలో రాష్ట్ర తలసరి ఆదాయం పెంచడంలో జగనన్న సంస్కరణలు ఎంతగానో దోహదం చేశాయన్నారు. వృత్తి పనులు చేసుకునే వారికి అండగా, విద్యార్థులకు చదువును అందిస్తూ విద్యా ప్రదాతగా, ఆడ పడుచులను సోదరుడిలా ఆదుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలుపుకునేందుకు పథకాల అమలుతో పాటు ఇంకా సమస్యలు ఉంటే తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేసి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డే రావాలని ప్రజలు ఆకాంక్షించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వార్డులలో జరిగిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేసే క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్స్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యశ్రీ, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఆపు బాబూ నాటకం-జగనన్నే మా నమ్మకం




సీతానగరం: మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్‌లను ఆవిష్కరిస్తున్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు

సీతానగరం: జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామాల్లో ప్రతి ఇంటికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా అందుతుండడంతో తామంతా భవిష్యత్‌లో జగనన్నకు రుణపడి ఉంటామని ప్రజలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరుగుతున్న వైఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం బుధవారం కాశీపేటలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు ఆధ్వర్యంలో జరిగింది. సచివాలయం ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని అవిష్కరించిన అనంతరం, జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు సంక్షేమపథకాల డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ వీధుల్లో 'ఆపు బాబూ నాటకం-జగనన్నే మా నమ్మకం' నినాదాలతో ప్రజలతో కలిసి స్థానిక నాయకులు, మండలనాయకులు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.ధనుంజయమ్మ, స్థానిక నాయకులు టి.శ్రీనివాసరావు, ఎం.ప్రభాకరరావు, టి.సత్యంమాస్టారు, పీఏసీఎస్ చైర్మన్ బి.ధనుంజయరావు, పణుకుపేట సర్పంచ్ బి.పద్మావతి, శ్రీహరినాయుడు, డీసీఎంస్ డైరెక్టర్ శ్రీకాంత్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి.వెంకటప్పలనాయుడు, ఏఎంసీ డైరెక్టర్ ముకుందరావు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గృహసారథులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఎస్.అవినాష్



బలిజిపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఏఎంఓ శ్రీనివాసరావు

సీతానగరం: వచ్చే ఏడాది జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని ఎంఏఓ ఎస్.అవినాష్ కోరారు. ఈ మేరకు ఎంఈఓ జి.సూరిదేముడుతో కలిసి ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారి, ఎంఏఓ ఎస్.అవినాష్ మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల విద్యాప్రాప్తిని పెంపొందించడానికి, టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి వీలుగా విద్యార్థులకు బోధనాతరగతులు నిర్వహించాలని కోరారు. తరగతుల నిర్వహణకు ఉపాధ్యాయులు తయారుచేసిన ప్రణాళిక విధంగానే విద్యాబోధన చేయాలని చెప్పారు. ఎంఈఓ సూరిదేముడు మాట్లాడుతూ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు మండలస్థాయి అధికారులను పర్యవేక్షణకు ప్రభుత్వం నియమించిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

తగ్గిన ధాన్యం దిగుబడి

మండలంలోని వర్షాధార భూముల్లో వరిచేను పంటకు నష్టం వాటిల్లి వివిధ గ్రామాల్లో పంట దిగుబడి తగ్గిందని ఏఓ అవినాష్ అన్నారు. వర్షాధార భూములున్న కె.సీతారాంపురంలో వరిచేను పంటలో పటకోత ప్రయోగాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. పంటదిగుబడికి నిర్దేశించిన విస్తీర్ణంలో వరిచేను కోసి ధాన్యం దిగుబడి 2.30 కేజీలు వచ్చిందని చెప్పారు. వర్షాధార భూములున్న గ్రామాల్లో వర్షాలు కురవక పోవడం వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిందన్నారు.

పది పరీక్షల్లో మంచి ఫలితాలు రావాలి

బలిజిపేట: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని ఏఎంఓ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని చిలకలపల్లి ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం పర్యవేక్షించారు. పదవ తరగతి పరీక్షల దృష్ట్యా చిలకలపల్లి ఉన్నత పాఠశాలకు తనను ప్రత్యేకాధికారిగా నియమించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు, సిలబస్, చదువుపై ప్రణాళికలను విద్యార్థులు తయారుచేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సిలబస్ పూర్తిచేసిన వెంటనే ప్రత్యేక దృష్టిసారించి కష్టపడి చదవాలని హితవు పలికారు. మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ సామల సింహాచలం, ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడుదాం- ఆంధ్రాను సమన్వయంతో నిర్వహించాలి

- జిల్లా క్రీడల చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: గ్రామ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి వరకు నవంబర్ 15 నుంచి జనవరి 26 వరకు జరగనున్న ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తి, ఐకమత్యం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 15 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి : ఎస్పీ

సీతానగరం: రాష్ట్రీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం వచ్చి వార్షిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి స్థానిక పోలీస్‌సిబ్బంది చేసిన గౌరవ వందనాన్ని ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్వీకరించిన అనంతరం పార్వతీపురం రూరల్ సీఐ స్వామినాయుడు, ఎస్సై నీలకంఠం పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, పరిశీలించి గతేడాది క్రైమ్, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై ఆరాతీశారు.

పార్టీకి సేవలందించిన వారికి ప్రాధాన్యం

సీతానగరం: జగనన్న నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి పనిచేసే వారికి ఏదో రూపంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని కామందొరవలస గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందిస్తున్న బుడితి ముకుందరావు సతీమణి పద్మావతి, బక్కుపేట మాజీసర్పంచ్ బక్కు శ్రీదేవిలను పార్వతీపురం వ్యవసాయమార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమించడంతో ఏఎంసీ చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ వి.శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావును నూతనంగా నియమితులైన ఏఎంసీ డైరెక్టర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్న కార్యకర్తలకు అధిష్ఠానం మంచి గుర్తింపు నిచ్చి గౌరవిస్తుందన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయినంతవరకూ అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. అనంతరం డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి, పద్మావతిలను జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండ జయంతి

పార్వతీపురంటౌన్: భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు బిర్సా ముండా జయంతి, విక్షిత్ భారత్ సంకల్ప యాత్రను పురస్కరించుకుని గిరిజన స్వాభిమాన్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు బుధవారం నిర్వహించిన ర్యాలీని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్సా ముండా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయారని కొనియాడారు. ర్యాలీ అనంతరం మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌బోను గౌరీశ్వరి అధ్యక్షతన ఐటీడీఏ సమావేశమందిరంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి, పి.మురళీధర్, వెలుగు ఏపీడీ సత్యంనాయుడు, ఐటీడీఏ. ఉద్యోగులు, విద్యార్థి, గిరిజన సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని ఓ షాపింగ్ మాల్ వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.